నిర్మల దరహసిత చిహ్న(ము) లును, సర్వమంగల(ము)లును; అగు ఆయీయార్యలు – కమనీయతమలగు స్త్రీలయందు అద్వితీయయగు ఉమాదేవి నుపాసించుఁగాత!

**ప్రభ:**- సర్వమంగల(ము)లు = స్తబకశ్లోకములందంతటను కల్యాణము గలవి. కలవారు ఆయీయార్యలు = ప్రస్తుత స్తబకమునం దుపక్రమింపఁబడిన ఆర్యా వృత్తనిబద్ధములగు స్తుతులు. ఆర్యలగు స్త్రీలు స్తబకమునందలి శ్లోకములన్నిటి యందును. మందస్మితమును గూర్చియే ప్రస్తావించుట వలన నీయార్యలకు మందస్మితమే చిహ్నమగుచున్నది. అంతటనుగూడ మాంగల్యమునే ఆశాసించుట వలన నీయార్యలు సర్వమంగల లగుచున్నవి.

తృతీయ శతకమునందలి ప్రథమస్తబకము ఇట్లు – ఆర్యల చేత ఉమాదేవతనుపాసించి యుపసంహరింపఁబడి ముగిసినది.

ఇది సవ్యాఖ్యమగు ఉమాసహస్ర తృతీయ శతకమునందలి
ప్రథమ స్తబకము
శ్రీ. శ్రీ. శ్రీ.

****



ఓం నమోభగవతే శ్రీ రమణాయ

# ఉమాసహస్రము

## (తృతీయ శతకమున – ద్వితీయ స్తబము)

## దశమ స్తబకము

**అవ:**- ఈ దశమ స్తబకము భగవతి యొక్క కేశాది – పాదాంత స్తుతిపరము.

ము॥ సజ్జాలనాయహరితాం, విభూతయే
లోకత్రయస్య, మదనాయ ధూర్జటేః
కాత్యాయనీవదనతః శనైః శనైః
నిర్యన్తి శుభ్రహసితాని పాన్తునః॥ 1

దిశలను విమలీకరించుటకును, లోకత్రయమునకును, విభూతినిచ్చుటకును, ధూర్జటికి కామముఁగలిగించుటకును కాత్యాయనీ వదనము నుండి మెల్లమెల్లగా బయలువేడలుచున్న తెల్లనిచిరునవ్వులు – మమ్ము రక్షించుగాత!

**ప్రభ:**- విభూతియన నైశ్వర్యము, ధూర్జటియన శివుఁడు నైర్మల్య– ఐశ్వర్య సాహచర్య సంపాదకములగు భగవతీ మందహాసములు – అస్మద్రక్షకములుగాఁ బ్రస్తుతింపబడినవి. ఇందు – హేతుమండలములగు దిశలను విమలీకరించుట మున్నగు కార్యములతోఁగూడ హేతువగు శుభ్రహాసితములను వర్ణించుట వలన నిది హేతువను నలంకారమగుచున్నది. మఱియు – ఆ శుభ్రహసితములు దిశలను విమలీకరించునవిగను, లోకత్రయమునకు విభూతి నిచ్చునవిగను, ధూర్జటికి కామము

కల్పించుననవిగను, బహు విధముల నుల్లేఖింపఁబడుట వలన ఉల్లేఖాలంకారము గూడ నగుచున్నది. తిలతండుల న్యాయమున స్ఫుటముగాఁ దెలియఁదగిన భేదము గల – హేతు – ఉల్లేఖములతోఁ గూడియుండుట వలన నిది 'సంసృష్టి' అనునలంకారమగును.

మూ॥ స్వల్పోఽపి దికుకిరణాన్ ప్రసారయన్
మన్దోఽపి బోధమమలందధత్ సతామ్
శుభ్రోఽపి రాగకృదనఙ్గవైరిణో
హాసః పురాణసుదృశః పునాతు నః॥ 2

మిక్కిలి యల్పమైనదయినను దిక్కులన్నిఁటియందును కిరణములను ప్రసరింపఁజేయునదియు, మందము అయినను సజ్జనులకు నిర్మలమగు జ్ఞానమును గలుగఁజేయునదియు, శుభ్రమయినను, అనంగవైరియగు శివునకు రాగమును జనింపఁజేయునదియునగు, పురాణసుందరియగు నుమయొక్క హాసము మమ్ము పవిత్రుల నొనర్పుఁగాత!

**ప్రభ:**- మందము = అలసము లేక అల్ప ప్రజ్ఞగలది. శుభ్రము = తెల్లనిది లేక పరిశుద్ధమయినది. రాగము = ఎఱుపు లేక అనురాగము. స్వల్పమగు హాసము అంతటను ప్రసరించుట విరుద్ధము. అది యుమాహాసమునకు స్వాభావికము కావున పరిహరింపఁబడును. అట్లే మందమగుదానికి సద్ బోధనము. విరుద్ధము. అదికూడ నుమాహాసమునకు స్వాభావికము. కావున పరిహరింపఁబడును. శుభ్రమగునది (తెల్లనిది) రాగమును (ఎఱ్ఱఁదనమును) జనింపఁజేయుట విరుద్ధము. ఇచట రాగపదమునకుశ్లేషమూలకమగు అనురాగము నర్థముగాఁ జెప్పుకొనుట వలన మీఁది విరోధము కూడ పరిహరింపఁబడును. మీఁది శ్లోకమునందంతటను గూడనిట్లు విరోధము కాన్పించినను అది ఆభాసము (లేనిదేయున్నట్లు తోచునది) కావున నిది విరోధాభాసమను నలంకారమగుచున్నది.



మూ॥ చేతోహరోఽప్యతిజుగుప్సితో భవేత్
సర్వోఽపి జీవకలయా యయా వినా
సావర్ణ్యతాం కథ మపారచారుతా
పీయూష సిన్ధురఖిలేన్ద్రసున్దరీ॥ 3

ఏ జీవకళను (జీవనాధాయినియగు సుషమను విడిచిన యెడల మనోహరమయినను గూడ నీలోకమంతయును గూడ మిక్కిలి జుగుప్సావహమగుచుండునో అపారసుషమామృతసాగరమగు ఆసర్వేశ్వరసుందరి – యెట్లు వర్ణింపఁబడును?

**ప్రభ:**-జీవ శబ్దము బృహస్పతియందును, ప్రాణమునందును, జీవనమునందును, ఆత్మయందును, పక్షియందును వర్తించునని నానార్థరత్నమాల చెప్పుచున్నది. కావున నిచట జీవశబ్దమునకు జీవన మర్థమగుచున్నది. కలాశబ్దము, అంశమాత్రమునందును, మూలవృద్ధియందును, సుషమ (గొప్ప సౌందర్యము) యందును, విద్యయందును వర్తించునని త్రికాండశేషము చెప్పుచున్నది. సర్వేశ్వరసుందరీ విశేషణానురూపత వలన కలాశబ్దము చేత నిట సుషమ యర్థమగుటకు యుక్తమగుచున్నది. కావున జీవకలయన జీవసుషమ యనునర్థము గ్రహింపఁదగుచున్నది.

అవ్యయ – లావణ్యామృతరాశియగు భగవతియే – ఆజీవ కళ. అది (భగవతియగు జీవకళ) లేనియెడల లోకమంతయుఁగూడ భీభత్సరసావహమగును. – మూలకళయగు ఆసుషమ (సౌందర్యము) ఉండినసే జీవనము సంభవించును. ఆ జీవన ముండినసే యితరములగు నంగములు రమణీయములై వెలుంగును.

కావున అంగ సౌందర్యముల కన్నిఁటికిని మూలము – అంగిసౌందర్యమేయగును – ఆయంగి సౌందర్యము – జీవకళయే యని గ్రహించునది.

మూలసౌందర్యము (జీవకళ) శరీరమునుండి తొలఁగినపుడు, మరణించిన శరీరము నందలి యంగముల సౌందర్యములు ఎవ్వనికైనను ఎట్లు రుచించును? రుచింపకపోవుట యటుండ వైరస్యమునే కలిగించును. అంగి – జీవకలాసంపన్నమగునపుడే అంగములు సరసము లగుచుండును. జీవకళావంతమగు అంగితోడి సంవాదము వలననే ఆయంగములలో నొక్కొక్కదానికిని, అన్నింటికిని గూడ రామణీయకతా నిష్పత్తియగుచున్నది. మరణించిన దంతయు – అసుందరమే యగుట వలన విరసమగును. సమరసమును, సరసమును అగు సౌందర్యము జీవనభూతమగు నమ్ము తము. అది (జీవనమను ఆయమృతము) అఖిలేంద్ర సుందరీ స్వరూపమేయని తెలియునది.

**అవ:-** ఈ స్తబకమున పార్వతీ కేశపాది వర్ణనము నారంభించుచు, సర్వసౌందర్య మూలకలయగు నాయమ్మను వర్ణించుటకు సమర్థుఁడెవ్వడును లేఁడని యుపక్రమించుచున్నాడు.

మూ॥ అత్యల్ప దేవవనితాంచ పార్థివై
ర్భావైర్వయం తులయితుం నశక్నుమః
తాం కిం పునః సకల దేవ సున్దరీ
లోకాక్షి పారణ తనుప్రభాముమామ్ ॥ 4

మానుషకవులమగు మేము సామాన్యయగు దేవాంగననుగూడ పార్థివములగు భావములతో సమీకరించుట ( ఉపమించుట) కు శక్తులము కానేరము (అట్టియెడల) దేవసుందరీ నయనపారణమగు శరీర ప్రభగల ఆ యుమనుపమించుట కెట్లు శక్తులమగుదుము?

**ప్రభ:-** పార్థివములగు భావములతో = భూలోక గతములగు రమణీయవస్తువులతో, నయన పారణమగు = నేత్రములకు వ్రతాంతమునందగు భోజనమగు (సంతర్పణమగు) సామాన్య సురసుందరిని గూడ వర్ణించుట



కశక్తులము. భూమిస్థులము, అగు మాకు – సర్వసుర సుందరీ నయనామృతాయ మానదేహ కాంతియగు భగవతి నిట్టిదని వర్ణించుటకు శక్తియెక్కడిదని తాత్పర్యము.

అర్థాపత్తి – అలంకారము.

మూ॥ వర్షా పయోద పటలస్య సాన్ద్రతా
సూర్యాత్మజోర్మిచయ నిమ్న తుఙ్గతా
కాలాహి భూమిపతి దీర్ఘతాచతే
కేశేషు భర్గభవనేశ్వరి! త్రయమ్ ॥ 5

ఓ శివ గృహిణీ ! వర్షాకాలమున మేఘపటలమునందగు సాంద్రతయు, యమునాతరంగ సందోహమునందగు నిమ్న – తుంగతయు, కాలాహిలోకపతి యందగు దీర్ఘతయు, అను నీమూఁడును గూడ నీ కేశములయందున్నవి.

**ప్రభ:-** సాంద్రత = నిబిడత – దట్టమైయుండుట. నిమ్న – తుంగత = ఎత్తుపల్లములు గలిగియుండుట (భంగిమత్త) దీర్ఘత – ఆయతత్వము – పొడవై యుండుట కాలాహిలోకపతి – కృష్ణవర్ణము గల నాగరాజు. ఇట్లనేకములగు నుపమాధర్మములన్నియుఁగూడ ఒక్కటియే యగు కేశపాశమున సమావేశించుట వలన ఇది – మాలోపమాలంకార మగుచున్నది. ''మాలోపమా యదేకస్యోపమానం బహుదృశ్యతే'' ఒకే యుపమేయమునకు అనేకములగు నుపమానములు కాన్పించునెడలనది – మాలోపమయగును. అని సాహిత్య దర్పణమున లక్షణము చెప్పఁబడినది.

మూ॥ ఈశానసున్దరి ! త వాస్య మణ్డలా
న్నీచైర్ని తాన్త మమృతాంశు మణ్డలమ్
కోపాన కీర్తయతి లోష్టపిణ్డకమ్
లోకే నికృష్టమిహ మానవీ ముఖాత్ ॥ 6

ఈశ్వరసుందరీ! నీ ముఖమండలముకంటె చంద్రమండలము మిగుల నికృష్టము. ఈ లోకమున మానవీముఖము కంటె మృత్ పిండమును అధమముగా నెవఁడు చెప్పకుండును?

ప్రభ:- మానవీముఖముకంటె = మనుష్య (స్త్రీ) ముఖముకంటె ,మృత్ పిండము= మట్టిముద్ద. మట్టిముద్ద – మానుషీముఖము కంటె నికృష్టమని యందఱును జెప్పుదురు. జీవించియున్న సుందరి యొక్క ముఖమునకును, మట్టిముద్దకును, ఎంత భేదముండునో, ఉమా ముఖమండల – చంద్రమండలముల కంత భేదము గలదని భావము.

ఇచట – బింబములగు – ముఖమండల – చంద్రమండలములకు, మానుషీముఖలోష్ట పిండకముల యందగు ప్రతిబింబభావము చెప్పఁబడినది. కావున నిది దృష్టాంతాలంకారమగుచున్నది. మీఁది దృష్టాంతము చేత ప్రస్తుతమును, సమర్థనీయమును నగు – చంద్రమండలము యొక్క నికృష్టతను సమర్థించుట వలన అర్థాంతరన్యాసము అలంకార మగుచున్నది.

ప్రకృతార్థ సమర్థనము గల అర్థాంతరన్యాసమునకుఁ గల ప్రధానత వలన, తదుపయోగియగు దృష్టాంతము అంగమగుచున్నది. ఇట్లు – అంగమగు దృష్టాంతమునకును, అంగియగు అర్థాంతర న్యాసమునకును గల అంగాంగి భావమున నిది సంకరాలంకార మగుచున్నది.

మూ॥ బిభ్రత్యమర్త్య భువనస్థ దీర్ఘి కా
పఙ్కేరుహాణి వదనాయతే బలిమ్
నోచేత్ కథం భవతి సౌరభం మహద్
భిన్నే సుమేభ్య ఉరుకేశి ! తే ముఖే ॥ 7



పృథులమగు కేశపాశము గల జగజ్జననీ! స్వర్లోకస్థితములగు దీర్ఘికలయందలి పంకేరుహములు నీముఖమునకుపహారమును సమర్పించుచున్నవి. అట్లు సమర్పింపని యెడల పుష్పభిన్నమగు నీముఖమునందు గొప్పదగు సౌరభమెట్లు కలుగును?

ప్రభ:- దీర్ఘిక = వాపి (బొడ్డనబావి). ఉపహారము– బలి. పూజా ద్రవ్యము. సౌరభము – సౌగంధ్యము – పరిమళము. ''సురలోక వాపీగతములగు పద్మములు – నీముఖమునకు బలిగా తమ్మే యర్పించుకొనుచున్నవి. కావుననే పుష్పముకంటె వేరగు నీముఖమునకు గొప్ప పరిమళము గలుగుచున్నది.'' అని హేతుత్వమును సంభావించుట వలన నిది హేతూత్ప్రేక్షాలంకార మగుచున్నది. వాచ్యము కాకుండుట వలన నీ హేతూత్ప్రేక్ష – గమ్యమని చెప్పఁబడును.

మూ॥ గీర్వాణలోకతటినీ జలేరుహామ్
గన్ధే శుభే భవతు తే మనోరతిః
లోకాధిరాజ్ఞి! తవ వక్త్ర సౌరభే
లోకాధిరాజ మనసస్తు సమ్మదః ॥ 8

ఓ విశ్వేశ్వరీ! దేవలోక నదీజలేరుహముల శోభ నగంధమున నీమనః ప్రీతియగుఁగాక, నీకాంతుఁడగు విశ్వేశ్వరుని మనస్సమ్మదము మాత్రము నీ ముఖ సౌరభమునందే యగుచున్నది.

ప్రభ:- జలేరుహములు – పద్మములు. సకలమనోహర – సురలోక సుమనస్సౌభాగ్యాతిశాయియు, లోకాధిరాజ మనస్సమ్మాదకమును, అగు అటువంటి ముఖపరిమళము – ఉత్తమ – పద్మినీజాతి సుందరివగు నీకుఁ గలదని భావము.

మూ॥ కోభాషతాం తవ సవిత్రి చారుతాం
యస్యాః స్మితస్య ధవలద్యుతిర్లవః
యస్యాః శరీరరుచిసిన్ధు వీచయః
శమ్పాలతాః పృథులదీప్తి భూమయః ॥ 9

జననీ! ఏ నీ స్మితలవము - ధవలద్యుతియో (చంద్రుఁడో) ఏ - నీ దేహప్రభానదీతరంగములు - విపుల దీప్తి భూములగు శంపాలతలో, ఆ నీ చారుత్వమును, ఎవఁడు భాషించును?

ప్రభ:- లవము = లేశము - ధవలద్యుతి = తెల్లని కాంతిగల చంద్రుఁడు. శంపాలతలు = మెరుపుఁదీఁగలు. భగవతీ మందస్మితలేశమే చంద్రుఁడు. తరంగిణీ భంగోపమ - దేహ ప్రభయే - విపులప్రకాశక దేశములగు విద్యుల్లతలు. అని ఉభయత్ర - స్మిత - చంద్రులకును, దేహ ప్రభా - విద్యల్లతలకును, తాదాత్మ్యము నిశ్చయింపఁబడుట వలన రూపకమలంకారము, భగవతీహాసలేశము - చంద్రరూపమనియు, తద్దేహప్రభలు - విద్యుత్ రూపములనియుఁ జెప్పఁబడుట వలన ' అజగజ్జనని - బ్రహ్మాండశరీర' అనునంశము వ్యంజితము. ఈయాచార్యునిచే గానము చేయఁబడిన శివశతకమునందుఁగూడ నీయంశమిట్లు చెప్పఁబడినది.

''బిమ్బంమేచకతో యాజాత సుహృదో మన్దస్మితం సున్దరమ్.''

'దేని శరీరప్రభయే - మెరుపు - మెరుపే - దేవీశరీరప్రభ.' అని కూడనీ గ్రంథమునందే యింకొకచోటఁ జెప్పఁబడినది. ఈ యంశమింద్రాణీ సప్తశతియందుఁగూడ కాన్పించుచున్నది.

మూ॥ లోకామ్బికే! నవిలసన్తికేపురో
మన్దస్మితస్య తవరోచిషాం నిధేః
యేతు వ్యధాయిషత తేన పృష్ఠతో
హన్తైషుకాఽపి తిమిరచ్ఛటా భవేత్॥ 10

లోకాంబికా! రోచిస్సులకు నిధియగు (కాంతులకు పుట్టినిల్లగు) నీ చిరునవ్వున కెదుటనున్న వారు - ఎవరు ప్రకాశింపరు? ఆ చిరునవ్వుచేత అధఃకరింపఁబడిన వారి యందు మాత్రము - పాపము! ఒకానొక తిమిరచ్ఛట క్రమ్మియుండును!



ప్రభ:- అధఃకరింపఁడిన వారు = వెనుక నుంచఁబడినవారు. తిమిరచ్ఛట = తమః పరంపర - తెరలు తెరలుగా క్రమ్మినచీకటి.

''సర్వతేజో నిధియగు దేవీస్మితమునకు ముందున్నవారు తేజస్వులగుదురు. అస్మితరేఖ సోకని వారు - అనిర్వచనీయమగు అంధకారపరంపరలో మగ్నులగుదురు'' అని భావము. ఇట్లనుట చేత - భగవతీమందస్మితము - నిగ్రహానుగ్రహ సంపన్నమను నంశము - సూచింపఁబడుచున్నది.

మూ॥ కిం వారదావలిరుచిర్ముఖస్య కిం
సమ్ఫుల్లతా వరధియః కిమూర్మికా
సన్తోష పాదపసుమం ను శఙ్కర
ప్రేమస్వరూప ముత దేవి! తే స్మితమ్॥ 11

దేవీ! నీ చిరునవ్వు ముఖదంతపంక్తి ప్రభయా? ముఖసంపుల్లతయా? వర- ధీతరంగమా? సంతోషపాదప - సుమమా? శంకరప్రేమ స్వరూపమా?

ప్రభ:- ముఖ - సంపుల్లతయా = ముఖము యొక్క వికాసిత్వమా? వర - ధీ - తరంగమా = ప్రశస్తమగు బుద్ధియొక్క వీచికయా? సంతోషపాదప - సుమమా= సంతోషమను వృక్షము యొక్క పూవా? శంకర - ప్రేమ స్వరూపమా = శివునియందు నీకుఁగల ప్రేమకు స్వభావమా? దేవి స్మితమిట్లు వితర్కింపబఁడినది.

''సా దృశ్యమూలవము, భాసమానా విరోధకము. సమబలము - నానాకోట్యవగాహిని, ధీరమణీయము అగునది ససందేహాలంకారము.'' అను పండిత రాజలక్షణము ననుసరించి యది ససందేహాలంకృతియని తెలియునది.

మూ॥ దిశు ప్రకాశపటలం వితన్వతా
కోటి ప్రభాకర విభక్త తేజసా
నేత్రేణతే విషమనేత్ర వల్లభే!
పఙ్కేరుహం క ఉపమాతి పణ్డితః॥ 12

ఓ విషమ నేత్రవల్లభా! ప్రకాశ పటలమును సర్వదిక్కులయందును విస్తరించునదియు, కోటి సంఖ్యాకులగు సూర్యులచేత విభక్తమగు తేజము గలదియు, నగు నీ నేత్రముతో పంకేజమును (బురదయందు పుట్టిన తామరపూవును) ఏ పండితుఁడు సాటిచేయును?

**ప్రభ:-** విషమనేత్ర వల్లభా = త్రినేత్రకాంతా! సర్వదిగ్ వ్యాపియగు ప్రసారము గలదియు, కోటి సూర్యులకు విభజించి యీయఁబడిన స్వతేజోభాగములు గలదియు, నగు నీనేత్రమెక్కడ? బురదయందు పుట్టిన కమల మెక్కడ? పండితుఁడెవ్వఁడు తథావిధమగు నీ నేత్రముతో పంకజమును సమము చేయును? అనఁగా చేయఁడని యర్థము. ''విషమం వర్ణ్యతే యత్రఘటనాఽననురూపయోః'' ''అను రూపములు కానివానికి సంబంధము వర్ణింపఁబడిన యెడల విషమమగును.'' అను లక్షణము వలన నిది విషమాలంకార మగుచున్నది.

మూ॥ శ్రీ కర్ణ ఏష తవలోచనాఞ్చలే
భాన్త్యా దయాదయితయా ప్రబోధితః
ఏతం సవిత్రి! మమకఞ్చనస్తవం
శ్రుత్వాతనోతు భరతావనేః శ్రియమ్॥ 13

సవిత్రీ! నీలోచనాంచలమున వెలయుచున్న దయయను ప్రియరాలిచేత మేలుకొల్పబడిన యీనీ శ్రీకర్ణము ఈ నా స్తోత్రవిశేషము నాలించి - భరతఖండమునకు సంపద నిచ్చుగాత.

**ప్రభ:-** సవిత్రీ = జననీ! లోచనాంచలమున = కటాక్షమున, కడకంటిచూపునందు. శ్రీ కర్ణము = కర్ణమన - చెవి. నామాఖ్యానము కంటె ముందు - మాననార్థమగు శ్రీశబ్దము ప్రయోగింపఁబడినది, శ్రీ యుక్తమగుకర్ణము - శ్రీకర్ణమని కూడ విగ్రహ వాక్యమును జెప్పనగును. అట్లయిన శ్రీ కర్ణమునకు భరత శ్రీ సంధానము యుక్తమేయగును. ఇచట నీయంశము గుర్తింపఁదగినది.



ఖిలములగు కవికృతులయందును, పద్యములయందును ఈ పద్యము కాన్పించుచున్నది. ''నేత్రాదపి తే శ్రోత్రం సుమశరశత్రోః పురన్ధ్రి! ముఖ్యంనః! శ్రోత్రే స్తోత్రాద్విముఖే నేత్రం నతగాత్రి! కింకురుతామ్''.

పుష్పబాణునకు శత్రువగు శివుని కాంతవగు జననీ! నీ నేత్రముకంటె నీ శ్రోత్రము మాకు ముఖ్యము. ఓ నతగాత్రీ! శ్రోత్రము - స్తోత్రవిముఖమగు నెడల నేత్రమేమి చేయును? కావుననే కడకంటిచూపునందున్న దయాదయిత చేత ప్రబోధితమగు కర్ణము - ఈ స్తవము నాలించుఁగాత! అని చెప్పఁబడినది. ఆశ్రోత్రము - శ్రీమయము కావున వినినంతమాత్రముననే భరతఖండ శ్రీ విధానము సుకరమగును.

మూ॥ స్వానాసికాభవతి యుఞ్జతాంసతాం
సంస్తమ్భినీచలతమస్య చక్షుషః
త్వన్నాసికా పురహరస్య చక్షుషః
సంస్తమ్భినీ భవతి చిత్ర మమ్బికే ! 14

అంబికా! యోగసాధనము నొనర్చుచున్న సత్ పురుషులకు స్వీయమగు నాసిక, చంచలతమమగు స్వనేత్రమునకు - సంస్తంభిని (స్థిరతనిచ్చునది) యగుచుండును. నీనాసికమాత్రము - పురహరుఁడగు శివునియొక్క నేత్రమునకు సంస్తంభిని (స్థిరత నిచ్చునది) యగుచున్నది. ఇది యాశ్చర్యముగ నున్నది.

**ప్రభ:-** ముక్కు కొనయందు దృష్టినుంచి ధ్యానించుచున్నయోగికి తనముక్కు తనదృష్టిని వశీకరించుటకే సమర్థమగుచుండును. నీనాసమాత్రము - ఇంకొకని నయనమును వశీకరించుటకు సమర్థమగుచున్నది. ఇదే చిత్రమని తాత్పర్యము.

హరునిదృష్టి - భగవతీ నాసాగ్ర రామణీయక నిమగ్నమని భావము.

''విరుద్ధం భిన్నదేశత్వం కార్య హేత్వోరసఙ్గతిః''

''కార్య - కారణములకు - విరుద్ధమగు భిన్న దేశత్వము - అ సంగతి'' అనులక్షణము వలన ఇచట కార్యమగు పురహర చ ఖుస్సంయమనమునకును, దానికి హేతువగు, అంబికా నాసికకును భిన్న దేశస్థితి వలన ( కార్యమొకచోట - కారణమొకచోట - ఉండుటవలన) ఇది అ సంగతియను నలంకారమగుచున్నది.

మూ॥ బిమ్బ ప్రవాల నవపల్లవాదితః
పీయూషసార భరణాద్ గుణాధికః
గోత్రస్యపుత్రి! శివచిత్తరఞ్జకః
శ్రేష్ఠో నితాన్త మధరాధరోఽపితే ॥ 15

పార్వతీ! బింబము, ప్రవాళము, నవపల్లవము మొదలగువాని కంటె అమృత సారభరణము వలన గుణాధికమై, శివహృదయ రంజకమగు నీ, అధర - అధరము కూడ మిక్కిలి శ్రేష్ఠమగుచున్నది.

**ప్రభ:**- బింబము = ఎఱ్ఱని దొండపండు. ప్రవాళము. ఎఱ్ఱని రత్న విశేషము (పగడము) నవపల్లవము = ఎఱ్ఱని క్రొంజిపురాకు. అమృత సారభరణము వలన = అమృతరసమును భరించుట వలన. అధరాధరము = కెమ్మోవి ( క్రింది పెదవి) లేక మిక్కిలి నీచము. నీకెమ్మోవి - అమృతధరము. కావున అరుణ, బింబ ప్రవాళ - నవకిసలయములకంటె నధికమగు గుణముగలది. కావుననే శ్రేష్ఠమని భావము. అధర+ అధరమైనను = మిక్కిలి నీచమయినను, శ్రేష్ఠము - ఉత్తమము అను విరోధమున్నది. ఆకెమ్మోవి శివచిత్తరంజకమగుట వలన మీఁదివిరోధము పరిహరింపఁబడుచున్నది. కావున నిది విరోధాభాస మగుచున్నది.

ఇందు ఉపమానములగు బింబాదులకును - ఉపమేయమగు కెమ్మోవికిని - రక్తిమయందును, మార్దవము మొదలగువాని యందును సాధర్మ్యమున్నను, ఉపమేయమగు కెమ్మోవియందు అమృతరసభరణ రూపమగు విశేషముండుట వలన వ్యతిరేక మలంకారమగుచున్నది. ఇట్లు వ్యతిరేక విరోధాభాసములకుఁ గల అంగాంగిభావము వలన నిది సంకరమగుచున్నది.



మూ॥ దోర్వల్లికే జనని ! తే తటిత్ ప్రభా
మన్దారమాల్య మృదుతాపహారకే
నిశ్శేషబన్ధదమనస్య ధూర్జటే
ర్బన్ధాయ భద్రచరితే బభూవతు ॥ 16

జననీ! భద్రచరిత్రా! విద్యుత్ ప్రభయొక్కయు, మందార మాల్యముయొక్కయు, మృదులత నపహరించునవియగు నీ బాహులతికలు నిశ్శేషబంధదమనుఁడగు (బంధమునంతను తెంపుకొనినవాఁడగు). ధూర్జటిని బంధించివైచినవి.

**ప్రభ:**- విద్యుత్ - ప్రభ = మెరుపు యొక్క కాంతి, మందారమాల్యము = సురలోకమందలి మందార పుష్పము. బాహులతికలు = బాహువులను తీగలు. నిశ్శేషబంధదమనుఁడు = సమస్తబంధములను తొలఁగించువాఁడు. ధూర్జటి = శివుఁడు. మెరుఁపు మెఱుఁగుకంటెను, మందార పుష్పముకంటెను మిక్కిలి మెత్తనివగు నీ భుజలతికలు - సర్వబంధ నివారకుఁడయినను హరునకు బంధమును ఘటించినవను విరోధము - ఆ బంధము ప్రేమకృతమగుట వలన పరిహరింపఁ బడుచున్నది. (అభాసమగుచున్నది) కావున నిది విరోధాభాసమను నలంకార మగుచున్నది.

మూ॥ హస్తాబ్జయోస్తవ మృదుత్వమద్భుతం
గృహ్ణాతి యే సదయ మేవ ధూర్జటిః।
అత్యద్భుతం జనని! దార్ఢ్యమేతయోః
శుమ్భాది దర్పవిలయోఽయయోరభూత్॥ 17

అమ్మా! హరుఁడు వేనిని దయతో గ్రహించుచున్నాఁడో ఆనీహస్తాబ్జముల మృదుత్వము - అద్భుతమగుచున్నది. అయినను వీనిదృఢత్వము - అత్యద్భుతమగుచున్నది. ఇవియే (హస్తాబ్జములే) శుంభాదులగు నసురుల దర్పమును నశింపఁజేసినవి.

**ప్రభ:-** మృదులములగు పాణులు - ధృఢములగుట విరుద్ధము. మీఁదివిరోధము - ఆహస్తములకుఁ గల స్వాభావికమగు ప్రభావము చేత పరిహరింపఁబడుచున్నది. కావున నిదియు విరోధాభాసమేయని గ్రహించునది.

మూ॥ రాజన్తుతే కుచసుధా ప్రపాయినో
లోకస్య మాత రనఘాః సహస్రశః
ఏ తేషు కశ్చన గజాననః కృతీ
గాయన్తియం సకలదాయి సత్కరమ్ ॥ 18

జగన్మాతా! నీయొక్క స్తన్యసుధా ప్రపాయులును, పవిత్రులును అగు ప్రజలు వేలకొలఁదియు లోకమునందుండవచ్చును. వీరి యందొకఁడగు గజాననుఁడు కృతియగుచున్నాడు. విద్వాంసు లితనినే సకలమును గూడ దానము చేయు స్వభావము గల శోభనమగు హస్తము (తొండము) గలవాఁడని గానము చేయుదురు.

**ప్రభ:-** స్తన్యసుధాప్రపాయులు = తల్లి చనుబాలు ద్రావినవారు. కృతి = సుకృతి. విద్వాంసుడు. గజాననుఁడు - గజముఖుఁడు - గణపతి. గజానననిహస్తము (తొండము) నందే - సర్వదాన సమర్థత యున్నది. కావున నాగజముఖుఁడే - ధన్యతముఁడని భావము. మూలమున 'సకలధాయి సత్కరమ్' అను పాఠముగూడఁ గలదు. అపుడు సకలము ధరించు స్వభావము గల హస్తము గలవాఁడనునర్థము నెఱుఁగునది. నీకుచసుధా ప్రభావ మట్టిదని భావము.

మూ॥ త్వన్నాభికూపపతితాం దృశం ప్రభో
ర్నేతుం వినిర్మలగుణే పునస్తటమ్।
సౌమ్యత్వదీయ హృదయప్రసారితః
పాశః సవిత్రి! తవ రోమరాజికా ॥ 19



విశిష్టమగు పవిత్రగుణము గల సవిత్రీ! నీ రోమ రాజిక (లోమరేఖ) నీనాభికూపమున - పతితమయిన ప్రభువగు హరునియొక్క దృష్టిని తిరుగ తటమునకుఁ జేర్చుటకు, సౌమ్యమగు నీ హృదయము చేత ప్రసాదితమయిన పాశము.

**ప్రభ:-** రోమరాజియే రోమరాజిక. నాభికిమీఁద హృదయము వఱకును గల లోమ రేఖయే యిచట రోమరాజిక అని చెప్పఁబడినది. కూపము = నూయి. తటము - తీరము ( ఒడ్డు) పాశము = త్రాడు. నీ హృదయము - నీ నాభియందాసక్తమయిన హరుని దృష్టిని, తనకున్ముఖమగునట్లాకర్షించెనను భావమును చమత్కరించుటకు, నాభియందుకూపమును, వక్షోజమధ్యమగు హృదయమునందు తటమును రోమరాజియందు పాశమును, తాదాత్మ్యము చేత సంభావించున్నాఁడు. నాభియను కూపము హృదయమును తటము, రోమరాజియును పాశము అని తాదాత్మ్యమాత్రమునం దౌచిత్యమగునెడల రూపకప్రతిపత్తి ( రూపక జ్ఞానము) దుర్నివారమే యగును. ( రూపకమను తెలివిని వారించుట కష్టసాధ్యమగును) 'నాభి' మున్నగువానకి కూపాదుల తాదాత్మ్యమును సంభావించుటయం దౌచిత్యమునంగీకరించి - ఆ రూపక ముత్ప్రేక్షయందు పర్యవసించుననని చెప్పనగును. 'చిత్రమీమాంస' అనునలంకార శాస్త్రమున అప్పయ్య దీక్షితుల వారు '' ఔచిత్యమువలన ఉపమాలంకారము - ఉత్ప్రేక్షయందు పర్యవసించును'' అని చెప్పి రూపక ప్రతీతిస్థలమునందుఁగూడ తాదాత్మ్యసంభావన ముచితమగునపు డిట్లే దానికి ఉత్ప్రేక్షయందు పర్యవసానము - అవగంతవ్యమనుటకు క్రిందియుదాహరణము నిచ్చియున్నారు.

శ్లో. రక్షన్తుత్వా మసితజలజై రఞ్జలిః పాదమూలే
మీనా నాభీసరసి హృదయే కౌస్తుభాఖ్యామురారేః
హారాః కణ్ఠే హరిమణిమయాః వక్త్రపద్మే ద్విరేఫాః
పిఞ్ఛాచూడాశ్చికురనిక రేఘోష యోషిత్ కటాక్షాః ॥

కృష్ణుని పాదమూలమున – నల్లకలువపూవుల యంజలియు, నాభీ సరస్సున మీనవములును, హృదయంవమున – కౌస్తుభవమును, కంఠవమున – ఇంద్రనీలమణిమయహారములును, ముఖపద్మమున – తుమ్మెదలును చికుర నికరమున – నెమలి పురిసిగలును అగు గోపస్త్రీ కటాక్షములు నిన్ను రక్షించునుగాత. ఇందు – గోపస్త్రీ కటాక్షములకు నీలోత్పలాంజల్యాది తాదాత్మ్యసంభావనముచితమగుట వలన రూపకమిచట నుత్ప్రేక్షయందు పర్యవసానము నొందినది. మూలశ్లోకమున ఇవాదివాచకము ప్రయోగింపఁబడకుండుట వలన నీయుత్ప్రేక్ష గమ్యమైనను మిక్కిలిస్పష్టమై వాచ్యాయమాన మగుటవలన అలంకారధ్వని కాక అలంకారమే యగుచున్నదని గ్రహించునది.

మూ॥ త్వన్మధ్యమో గగనలోక ఏవచేత్
త్వద్దివ్య వైభవవిదో న విస్మయః
ప్రాజ్ఞైర్హి సున్దరి! పురత్రయ ద్విషః
త్వం దేహినీ త్రిభువనేన గీయసే ॥ 20

పురత్రయశత్రువగు హరునిసుందరివగు భగవతీ! నీవుముల్లోకములును దేహముగాఁగలదానవని ప్రాజ్ఞులు గానము చేయుచుందురు. కావుననే నీ దివ్యవైభవము నెఱింగిన పండితునకు ''నీ నడుము అంతరిక్షమే'' అగునెడల ( ఈ విషయమున ఆశ్చర్యము కలుగనేరదు.)

**ప్రభ:-** ఉత్తమ కాంతల నడుము – ఆకాశమనునది కవి సమయము. ఆవాదమిచట చమత్కృతిజనక మగుచున్నది. ''నీకు త్రిభువనమే శరీరము. అందుమధ్యమ లోకమగు నంతరిక్షము – నీనడుము'' అనునంశము – నీ మహాప్రభావము నెఱిఁగిన వానికి విస్మయమును గలిగింపదని భావము.

ఇచట – మధ్యమము – గగనలోకమని యుపన్యసించుట దుష్కరవిషయము కావున సమర్థనము నపేక్షించును. ఆ నడుమును త్రిభువనేన దేహినీ ( ముల్లోకములును



దేహముగాఁగలదానవు) అని ముల్లోకములకును నడుమను గల అంతరిక్ష లోకమునుగా వ్యవహరించి సమర్థించుట వలననిది వాక్యార్థ హేతుకమగు కావ్యలింగాలంకారమగుచున్నది. ''హేతో ర్వాక్యపదార్థత్వే కావ్యలిఙ్గం నిగద్యతే'' అనునది దాని లక్షణము

మూ॥ నాభిహ్రదాద్ విగలితః కటీశిలా
భఙ్గాత్ పునః పతతికిం ద్విధాకృతః।
కాన్త్యోరుయుగ్మమిషతః సవిత్రి తే
భా వారిపూర ఇభశుణ్డయోః సమః ॥ 21

జననీ! నాభియేయగు తటాకమునుండి బయలువెడలి, కటియేయగు శిలయందగు భంగము వలన తిరుగ ద్వివిధముగా ఖండింపఁబడిన. నీకాంతి ప్రవాహము – గజతుండములకు సదృశమగుచు, కమనీయమగు ఊరుయుగళమను మిషచేత ప్రసరించుచున్నదా ?

**ప్రభ:-** మీది ప్రశ్నము సంభావనార్థకము. నాభి– హ్రదములకును, కటీశిలలకును గల తాద్రూప్యమువలన రూపకమలంకార మగుచున్నను తాద్రూప్యసంభావనయందలి యౌచిత్యము వలన ఉత్ప్రేక్షయందు పర్యవసించును. అది ' ఊరు యుగళమను మిషచేత' అను, అపహ్నవము (కప్పిపుచ్చుట) వలన, సాపహ్నవ-స్వరూపోత్ప్రేక్షయగును. ఇవాదివాచకము లేకుండుట వలన, ఈయుత్ప్రేక్ష గమ్యమగును.

మూ॥ జఙ్ఘాయుగం తవ మహేశనాయికే:
లావణ్యనిర్ఝరి జగద్ విధాయికే
అన్తః పరిస్ఫురదగుప్త సుప్రభా
బాణాఢ్యతూణయుగలం రతీశితుః ॥ 22

జగద్ విధాయికా ! మహేశనాయికా ! నీవు లావణ్యనిర్ఝరివి నీ జంఘాయుగలము – లోపలపరిస్ఫురింపుచు, అగుప్తములగు (దాచబడనివగు) సుకాంతి బాణములచేత సంపన్నమగు రతీశ్వరుని తూణయుగలము – (అమ్ములపొదులజంట).

**ప్రభ:**-లావణ్యనిర్ఝరివి = రామణీయక ప్రవాహముగలదానవు. జంఘాయుగలము = కాలి వెనుకటిభాగములు (రెండుపిక్కలు) అగుప్తములు – దాచఁబడనివి. సుకాంతి = బాణములు = శోభనములగు కాంతులను బాణములు. ఇచటి యలంకారముకూడ గమ్యోత్ప్రేక్షయే. ''నీజంఘలు – మన్మథుని అమ్ములపొదులవలెనున్నవి'' అని భావము.

మూ॥ పుష్పాస్త్రశాసననిశాన్త రాజ్ఞి! తే
లోకత్రయస్థఖలకమ్పనం బలమ్
శ్రోణీ భరేణ గమనే కిలశ్రమం
ప్రాప్నోషితేన తవతత్త్వముచ్యతామ్ ॥ 23

పుష్పాస్త్రుఁడగు మన్మథుని శాసించిన శివుని గృహమునకు రాజ్ఞివగు జననీ! నీబలము – ముల్లోకములయందునుగల దుర్జనులను కంపింపఁజేయునది. అయినను నీవు నడచునపుడు నీ శ్రోణీభరము చేత నగుశ్రమము నొందుచుందువట ! దీనికి హేతువగు తత్త్వమును చెప్పుము.

**ప్రభ:**- ''నీబలము – త్రిలోక దౌర్జన్య దమనమైయున్నను, అల్పమగు శ్రోణీ భారమునకు నీకు శ్రమము కలుగుచున్నది. ఇందలి రహస్యమేమి?'' అని భావము. ''విభావనా వినాఽపిస్యాత్ కారణం కార్యజన్మచేత్'' కారణము లేకున్నను గూడ కార్యముదయించునెడల నది విభావనయగును. అనులక్షణమువలన, ఇచట – శ్రమ గలిగించు కారణములేకున్నను శ్రమమను కార్యము కలుగుట వలన విభావన – అలంకారమగుచున్నది.



మూ॥ యత్రైవ నిత్యవిహృతే రభూద్ రమా
రాజీవ మన్దిర చరీతి నామతః।
తస్మైనదాభణతు మఙ్గలం శివా
పాదామ్బుసమ్భవ మమేయ వైభవమ్ ॥ 24

ఏ యుమాపాద పద్మమునందు – నిత్యమును విహరించుట వలన రమ – నామముచేత రాజీవమందిరవిహారిణి యయ్యెనో అమేయ వైభవమగు ఆయుమాపద్మము – నాకు మంగళమును తెలుపుఁగాత (ఘటించుఁగాత!)

**ప్రభ:**- రాజీవమందిర విహారిణి – పద్మమను భవనము నందు విహరించునది. అమేయవైభవము = ఊహించుటకు (ప్రమాణమునకు) శక్యముకాని విభూతిగలది. లక్ష్మీదేవి – పద్మాలయ యగుటకు హేతువు – ఉమాపాద పద్మమునందుండుటయే అయి యిచట వ్యంగ్యముగా సంభావితము.

మూ॥ కేశాది పాదకమలాన్త గాయినీః
కస్తుప్రశాసననిశాన్త నాయికా।
అఙ్గీ కరోతు లలితా ఇమాః కృతీ
ర్గౌరీ కవేశ్చరణకఞ్జ సేవినః ॥ 25

మహేశ్వరపట్ట మహిషియగు గౌరి – నిజ కేశముల నుండి ప్రారంభింపఁబడి పాదకమలముల వఱకును స్తుతించునవియు, లలితములును (లలితా వృత్తముచే బంధింపఁబడినవియు) చరణకమల సేవియగు కవినగు నాచే రచింపఁబడినవియు, నగు ఈ కృతులను స్వీకరించుఁగాత !

**ప్రభ:**- లలితములు – సౌందర్యము గలవి లేక లలితయను పేరుగల వృత్తములు.

ఇది స్వవ్యాఖ్యమగు ఉమాసహస్ర తృతీయశతకమందలి ద్వితీయస్తబకము.

శ్రీశ్రీశ్రీ

****